కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా క్రికెట్ టోర్నీ

క్రీడా పోటీల షెడ్యుల్ విడుదల చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, ఫిబ్రవరి 4:బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకొని సిద్దిపేట రూరల్ మండలంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు బండి శ్రీకాంత్, దొడ్ల అరవింద్ రెడ్డి, మారెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, కురుమ నరేశ్ మాట్లాడారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు నేటి నుంచి 6వతేదీ సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులను సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేయాలన్నారు. పోటీలకు సంబంధించిన డ్రాలను 6వతేదీన సాయంత్రం తీయనున్నట్లు తెలిపారు. 8వతేదీ ఉదయం 8గంటలకు మొదటి మ్యాచ్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఏ గ్రామ క్రీడాకారుడు అదే గ్రామ జట్టులోఆడాలన్నారు. క్రీడాస్థలం రాఘవపూర్ నుంచి నారాయణరావుపేటకు వెళ్లే మార్గంలో ఉంటుందన్నారు. గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి రూ. లక్ష, రెండో బహుమతి రూ.50వేలను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అందజేయనున్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషిచేయాలి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కొమురవెల్లి, ఫిబ్రవరి 4 : స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని ఆపార్టీ మండలాధ్యక్షుడు గీస భిక్షపతి ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయా గ్రామాల ఇన్‌చార్జిలతో కలిసి బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరారు.మాజీ జడ్పీటీసీ సిలువేరు సిద్ధప్ప, బీఆర్ఎస్ స్థానిక ఎన్నికల ఇన్‌చార్జిలు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, రాజీవ్‌రెడ్డి, రంజితాకృష్ణామూర్తి, సిద్ధిరాములుగౌడ్, మెరుగు కృష్ణాగౌడ్, పూడెం గోపాల్‌రెడ్డి, బూర్గు స్వామి, బచ్చల పరశురాములు పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నిఖత్‌అంజుమ్

గజ్వేల్, ఫిబ్రవరి 4: యువత సృజనాత్మకతను పెంపొందించుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నిఖత్ అంజుమ్ అన్నారు. కళాశాలలో మంగళవారం 'కళాశాల యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ విభాగం' ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కొత్త ఆలోచనలతో సమాజానికి ఉపయోగపడే విధంగా విద్యార్థులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఐక్యూసీ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్, సమన్వయకర్త లక్ష్మీనర్సయ్య, మెంటర్స్ డాక్టర్ భవాని, డాక్టర్ కవిత, మార్కండేయ పాల్గొన్నారు.

సమసలు పరిష్కరించాలి

అదనపు కలెక్టర్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగేందర్

చేర్యాల, ఫిబ్రవరి 4 : మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని చేర్యాల మున్సిపల్ స్పెషల్ అధికారి, అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్ ఆదేశించారు. మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు తీసుకున్న అనంతరం మంగళవారం అదనపు కలెక్టర్ కార్యాలయానికి వచ్చి అధికారులను పట్టణ సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ నాగేందర్, మేనేజర్ ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కల్పించాలి

బాలసదనంలో చిన్నారులతో మాట్లాడుతున్న జడ్జి స్వాతిరెడ్డి

సిద్దిపేట టౌన్,ఫిబ్రవరి 4 : లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా న్యాయపరమైన సలహాలు,పిల్లలకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించాలని జడ్జి స్వాతిరెడ్డి వలంటీర్లకు సూచించారు.సిద్దిపేట బాలసదనంలో మంగళవారం లీగల్ ఎయిడ్ క్లినిక్,న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా లీగల్ ఎయిడ్ క్లినిక్‌లో ప్యానల్ లాయర్, ప్యారా లీగల్ వలంటీర్‌ను నియమించారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి రాము,అధికారులు మమత, శ్రీలత, స్వామి,బాబు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి పరామర్శ

మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాదాసు శ్రీనివాస్

గజ్వేల్, ఫిబ్రవరి4: మండలంలోని కొమటిబండ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఉబ్బని స్వామి అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పాల రమేశ్‌గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు భాస్కర్, ప్రభాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్వనాథ్‌పల్లిలో ఉచిత వైద్య శిబిరానికి స్పందన

మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్లు

కొండపాక(కుకునూరుపల్లి), ఫిబ్రవరి 4 : కొండపాక మండలంలోని విశ్వనాథ్‌పల్లిలో మంగళవారం మాజీ వార్డు సభ్యులు కోడెల రవి, గొడుగు రాజు, సత్తయ్య, పేర్ల మహేశ్, బాలరాజు సహకారంతో అతిథి దవాఖాన ప్రజ్ఞాపూర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 103 మందికి వైద్య పరీక్షలు చేయడంతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాకర్లు నాగేశ్‌గౌడ్, రాజు, మార్కెటింగ్ మేనేజర్ కల్యాణ్, సాయితేజ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

గజ్వేల్‌లో యూజీడీ మురుగుకాల్వను పరిశీలిస్తున్న కమిషనర్

గజ్వేల్, ఫిబ్రవరి 4: పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుధ్య పనులను మంగళవారం కమిషనర్ గోల్కొండ నర్సయ్య పరిశీలించారు. ఆయా వార్డుల్లో రోడ్లు, మురుగు కాల్వలను శుభ్రం చేయడం, ఇంటి పన్ను వసూలు తీరు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా మున్సిపల్ చెత్తబండి వాహనాల సిబ్బందికి ఇవ్వాలని, నల్లా బిల్లులు, ట్రేడ్ లైసెన్స్ పన్నులు చెల్లించిసహకరించాలని ఆయన కోరారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

గజ్వేల్, ఫిబ్రవరి 4: విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సీఐ సైదా కోరారు. మండలంలోని రిమ్మనగూడ జడ్పీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మనిషి మనుగడ చదువు, సంస్కారం, క్రమశిక్షణ వంటివి ప్రతి విద్యార్థికి ముఖ్యమన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజు, షీటీమ్ బృందం శ్రీరాములు, లావణ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 4: రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు గ్రామాల్లో డిజిటల్ క్రాప్‌సర్వే(డీసీఎస్) నిర్వహిస్తున్నట్లు మద్దూరు మండల వ్యవసాయాధికారి బూరెల రామకృష్ణ తెలిపారు. మంగళవారం మద్దూరు, లద్నూర్ గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో రాజు, రైతులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలి

బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మండల సమన్వయకర్త పాల సాయిరామ్

అనంతసాగర్‌లో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ

నారాయణరావుపేట మండలం గుర్రాలగొందిలో జెండాను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నంగునూరు మండలం తిమ్మాయిపల్లిలో జెండాను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చిన్నకోడూర్, ఫిబ్రవరి 4: స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మండల సమన్వయకర్త పాల సాయిరామ్ పిలుపునిచ్చారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు మండలంలో మంగళవారం బీఆర్ఎస్ జెండా పండుగ నిర్వహించారు. అనంతసాగర్, చర్లఅంకిరెడ్డిపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ జెండాలు ఆవిష్కరించారు. అనంతరం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఆంధ్రా వలసవాదుల చేతిలో తెలంగాణ ప్రజలు నలిగిపోతున్న తరుణంలో కేసీఆర్ ఉద్యమం చేపట్టి కేంద్రం మెడలు వంచి తెలంగాణ సాధించారని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా తాగు,సాగు నీరు అందించడానికి కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభించి తక్కువ సమయంలోనే పూర్తి చేశారన్నారు. రైతులకు రైతుబంధు, బీమా, వృద్ధులకు రెండువేల పింఛన్, గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారని గుర్తుచేశారు. ఇవాళ రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలను మోసం చేసి సాధ్యం కాని హామీలతో అధికారం చేపట్టారన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్లు కనకరాజు, సదానందం, మాజీ వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య, మేడికాయల వెంకటేశం, కొండం రవీందర్ రెడ్డి, జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, భూంపల్లి బాపురెడ్డి, బాలయ్య, నరసింహారెడ్డి, రంగయ్య, శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్, కాముని ఉమేశ్, గాలిపెల్లి లక్ష్మణ్, భూంపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నారాయణరావుపేట మండలంలో..

నారాయణరావుపేట, ఫిబ్రవరి 4 : మండలంలోని గుర్రాలగొంది, మల్యాల గ్రామాల్లో మండల ఇన్‌చార్జి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు ఆధ్వర్యంలో జెండా పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజనర్సు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క హామీని పూర్తిగా అమలు చేయలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎల్లయ్య, నాయకులు ఎల్లారెడ్డి, ఆంజనేయులు, హరీశ్ పాల్గొన్నారు.

ఆయా గ్రామాల్లో ..

నంగునూరు, ఫిబ్రవరి 4 : మండలంలోని కోనాయపల్లి, తిమ్మాయిపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ జెండా పండుగ నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అనగోని లింగంగౌడ్, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర ఆయిల్‌పామ్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కోల రమేశ్‌గౌడ్, నాయకులు బద్దిపడగ కృష్ణారెడ్డి, వేముల వెంకట్‌రెడ్డి, ఆయా గ్రామాల బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

పెదరాజుపేటలో మాట్లాడుతున్న ముస్త్యాల బాల్‌నర్సయ తదితరులు

చేర్యాల, ఫిబ్రవరి 4 : త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరవేసేందుకు బీఆర్ఎస్ శ్రేణులు ఇప్పటి నుంచే క్రమశిక్షణతో పని చేయాలని, కాంగ్రెస్ మోసపూరిత విధానాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని బీఆర్ఎస్ క్లస్టర్ ఇన్‌చార్జిలు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, ముస్త్యాల బాల్‌నర్సయ్య, ముస్త్యాల నాగేశ్వర్‌రావు కోరారు.ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని దొమ్మాట, వేచరేణి,గుర్జకుంట, తాడూరు, చిట్యాల,దానంపల్లి,పెదరాజుపేట, నాగపురి,శభాష్‌గూడెం గ్రామాల్లో సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులతో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశాలను మంగళవారం ఏర్పాటు చేసి ఎన్నికల్లో కార్యకర్తలు ఎలా వ్యవహరించాలనే అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని, ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైన విషయాన్ని ఇంటింటా ప్రచారం చేయాలన్నారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ప్రజలకు అమలు చేసిన పథకాలు, ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు అమలు చేస్తున్న పథకాల్లో తేడాలను ప్రతి ఇంటా వివరించాలన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం, మాజీ ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి,బీఆర్ఎస్ యూత్ ఇన్‌చార్జి శివగారి అంజయ్య, రైతుబంధు సమితి మండల మాజీ కోఆర్డినేటర్ రంజితాకృష్ణమూర్తి, ఇన్నారెడ్డి, సిద్ధిరాములు, మహిళా నాయకురాలు మానస, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, గ్రామశాఖ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

రహదారులపై చెత్త వేస్తే జరిమానా విధిస్తాం

హుస్నాబాద్‌టౌన్: చెత్తపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న మల్లికార్జున్‌గౌడ్

హుస్నాబాద్‌టౌన్, ఫిబ్రవరి 4: రహదారులు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్‌గౌడ్ హెచ్చరించారు. పట్టణంలోని 19వ వార్డులో మంగళవారం తడి, పొడి, హానికరమైన చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను ఇంటిలోనే వేరుచేసి వాహనాల సిబ్బందికి ఇవ్వాలని సూచించారు. చెత్తను వేరుచేసి ఇవ్వని పక్షంలో చెత్తను తీసుకోవడం జరగదని, చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేసేవారిపై జరిమానా విధిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, బేసిల్ ఫౌండేషన్‌కు చెందిన సభ్యులు నవీన్, సాయిత పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్ల విక్రయదారులకు జరిమానా

పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల విక్రయం, వినియోగిస్తున్న దుకాణాలపై మున్సిపల్ సిబ్బంది మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదు దుకాణాలపైదాడులు నిర్వహించి ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని వారికి రూ.1000 జరిమానా విధించారు. ప్లాస్టిక్‌కవర్లు వినియోగించినా, విక్రయించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని దుకాణాదారులను హెచ్చరించారు. ఈ దాడుల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, మున్సిపల్ సిబ్బంది ప్రభాకర్ పాల్గొన్నారు.

సిద్దిపేటలో..

సిద్దిపేట, ఫిబ్రవరి4: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని పలు వార్డుల్లో ఆయన పర్యటించారు. కార్మికుల హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు వాడకుండా స్టీల్ బ్యాంకులను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు.

ఓటరు జాబితాపై సమావేశం

కొమురవెల్లి, ఫిబ్రవరి 4 :మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఓటరు జాబితా ప్రదర్శించడంతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసవర్మ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు, తొలిగింపులపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాటిచెట్లు తొలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

రాంసాగర్‌లో తాటిచెట్లు తొలిగించిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎక్సైజ్ ఎస్సై సురేశ్

కొమురవెల్లి, ఫిబ్రవరి 4 : మండలంలోని రాంగసాగర్‌లో కొయ్యాడ ఇస్తారిగౌడ్ వ్యవసాయ పొలంలో తాటిచెట్లు తొలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని గౌడసంఘం సభ్యులు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎక్సైజ్ ఎస్సై సురేశ్, ఆర్ఐ శ్రీనివాస్, సిబ్బందితో కలిసి మంగళవారం గ్రామానికి చేరుకొని తాటి చెట్లు తొలిగించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తాటి చెట్లను గొడ్డలితో నరికి తొలిగించిన పక్క స్థలం యజమాని దాసరి రాజయ్యపై చర్యలు తీసుకోవాలని గౌడసంఘం నాయకులు కోరారు. కార్యక్రమంలో మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు పచ్చిమడ్ల స్వామిగౌడ్, జాతీయ ఉపాధ్యక్షుడు ముత్యం నర్సింహులుగౌడ్, జిల్లా నాయకులు కొయ్యాడ శ్రీనివాస్‌గౌడ్, బుడిగె గురువయ్యగౌడ్, రమేశ్‌గౌడ్, నాయకులు ప్రశాంత్‌గౌడ్, ఎల్లయ్యగౌడ్, శ్రీనివాస్, గ్రామపెద్దలు అక్కెనపల్లి నరేందర్‌రెడ్డి, తాడూరి పెద్ద నర్సయ్య పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్

ముందస్తుగా సర్పంచ్, వీఆర్ఏలను అరెస్టు చేసిన పోలీసులు

సిద్దిపేట, ఫిబ్రవరి 4: పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచ్‌ల ఫోరం ఇచ్చిన పిలుపుమేరకు చలో అసెంబ్లీకి తరలివెళ్తారనే నెపంతో సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట మండలాల్లో పలువురు మాజీ సర్పంచ్‌లను సిద్దిపేట రూరల్ పోలీసులు మంగళవారం తెల్లవారుజామున ముందస్తుగా అరెస్ట్ చేశారు. సిద్దిపేటమండలం చింతమడక మాజీ సర్పంచ్ హంసకేతన్‌రెడ్డి, రావురూకుల మాజీ సర్పంచ్ నీరటి రవి, నారాయణరావుపేట మండలం కోదండరాంపల్లి మాజీ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, ఇబ్రహీంపూర్ మాజీ సర్పంచ్ దేవయ్యను సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు.

తొగుటలో..

తొగుట,ఫిబ్రవరి 4: మండలంలోని మండల ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

హుస్నాబాద్‌లో..

హుస్నాబాద్, ఫిబ్రవరి 4: మండలంలోని పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గంగం మధుసూదన్‌రెడ్డితో పాటు వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు తోడేటి రమేశ్, గీకురు వెంకటేశం, మల్లయ్య, బత్తిని సాయిలును పోలీసులు అరెస్టు చేశారు.

చేర్యాలలో..

చేర్యాల, ఫిబ్రవరి 4 : అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి మండలం నుంచి మాజీ సర్పంచ్‌లు, వీఆర్ఏలు హాజరుకాకుండాఉండేందుకు పోలీసులు పలువురు మాజీ సర్పంచ్‌లు, వీఆర్ఏలను ముందస్తుగా అరెస్టు చేశారు. సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పెడతల ఎల్లారెడ్డి, మాజీ సర్పంచ్‌లు దినేశ్‌తివారి, కొండపాక భిక్షపతి, షేక్ సమీర్, వీఆర్ఏలు ఉన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు

కొండపాక(కుకునూరుపల్లి): టాలెంట్ టెస్ట్‌లో బహుమతులు అందుకున్న విద్యార్థులు

కొండపాక(కుకునూరుపల్లి), ఫిబ్రవరి 4 : కొండపాక మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో మంగళవారం మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా టాలెంట్ టెస్టులో మొదటి బహుమతి ఎన్.సాత్విక, ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాల, ద్వితీయ బహుమతి వై. హర్షిత, కేజీబీవీ కొండపాక, తృతీయ బహుమతి ఎస్.భారతి (కేజీబీవీ కొండపాక) ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సముద్రాల శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విట్టల్‌నాయక్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

హుస్నాబాద్‌రూరల్, ఫిబ్రవరి 4: మండలంలోని పోతారం(ఎస్) జడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం హుస్నాబాద్, అక్కన్నపేట మండలాలకు చెందిన టెన్త్ విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఆయా మండలాల్లోని ప్రతి పాఠశాల నుంచి టెన్త్‌లో ఎంపికైన ముగ్గురు మెరిట్ విద్యార్థులు ఈ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవానికి హుస్నాబాద్ ఎస్సై తోట మహేశ్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవోలు బండారు మనీలా, గుగులోతు రంగా, భౌతిక రసాయనశాస్త్ర ఫోరం డివిజన్ బాధ్యులు చింతకింది శ్రీనివాస్, రత్నాకర్, కండెం శ్రీనివాస్, మహేందర్, ఆత్మలింగం, తిరుపతి, జనార్దన్‌రెడ్డి, సంపత్‌రావు, శ్రీనివాస్, శ్రీధర్, రవీందర్, ప్రణవి పాల్గొన్నారు.

ధూళిమిట్టలో....

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి4: ధూళిమిట్ట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫోరం ఫర్ ఫిజికల్ సైన్స్ ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ పోటీలో ధూళిమిట్ట హైస్కూల్‌కు చెందిన బి. రిషివర్ధన్ ప్రథమ, బైరాన్‌పల్లి హైస్కూల్‌కు చెందిన డి. సాగర్‌కు ద్వితీయ, ధూళిమిట్ట హైస్కూల్‌కు చెందిన ఇ. ప్రణయ్‌కి తృతీయ బహుమతులను కాంప్లెక్స్ హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వి. శ్రీనివాస్ రెడ్డి, కో-కన్వీనర్ కొల్పుల రాములు, భౌతిక, రసాయన శాస్త్ర ఉపాధ్యాయులు నాగరాజు, రవీందర్, సతీశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

మాట్లాడుతున్న కమిషనర్ గోల్కొండ నర్సయ్య

గజ్వేల్, ఫిబ్రవరి 4: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని, పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య అన్నారు. మంగళవారం ప్రజ్ఞాపూర్ కోదండరాంపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉపయోగపడే విధంగా డెస్కులు,ఆటవస్తువులను ఐడీబీఐ బ్యాంకు ప్రజ్ఞాపూర్ వారు సీఎస్ఆర్ ఫండ్ ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థులకు అర్థవంతమైన బోధనను అందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. బ్యాంకు మేనేజర్ వినయ్‌కుమార్, ఎంఈవో కృష్ణ, హెచ్ఎం లలిత, ఉపాధ్యాయులు శ్రీశైలం, ప్రేమలత, ఈశ్వర్, బ్యాంకు అధికారి మధుకుమార్, సిబ్బంది కరుణాకర్, పరమేశ్వరాచారి, కమల్‌బాబు, విజయ్ పాల్గొన్నారు.

సస్యరక్షణచర్యలు చేపట్టాలి

సింగాయిపల్లిలో పంటల నమోదును పరిశీలిస్తున్న అధికారులు

వర్గల్, ఫిబ్రవరి4: సస్యరక్షణ చర్యలు చేపట్టి అధికదిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి శేషశయన రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని తున్కిఖల్సాలో డిజిటల్ యాప్ ద్వారా నిర్వహించిన రైతునేస్తంలో ఆమె పాల్గొని రైతులకు సూచనలు తెలియజేశారు. ముఖ్యంగా పంటరక్షణకోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం సింగాయిపల్లి, చౌదర్‌పల్లి గ్రామాల్లో పంటనమోదు తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు ధర్మేందర్, సంతోష్‌కుమార్, భారతి, సునీత, సుప్రజతేజస్విని, రైతులు పాల్గొన్నారు.

సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో ఆకస్మిక తనిఖీ

సిద్దిపేట, ఫిబ్రవరి 4 : జిల్లా కేంద్రంలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్, జిల్లా స్టోర్‌ను మంగళవారం డీఎంహెచ్‌వో పల్వాన్ కుమార్ ఆకస్మికంగా సందర్శించారు. జిల్లా స్టోర్‌ను సందర్శించి మందుల నాణ్యత, రికార్డులను పరిశీలించారు. ఏవో నవీన్ రాజ్‌కుమార్, ఆఫీస్ సూపరింటెండెంట్ అనిల్ కుమార్, ఫార్మాసిస్ట్ వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్

సిద్దిపేట టౌన్,ఫిబ్రవరి 4 : లైసెన్స్ లేకుండా ఆటోలు నడుపుతున్న15 మంది డ్రైవర్లను పోలీసులు స్పెషల్ డ్రైవ్‌లో పట్టుకున్నారు.ఈ మేరకు ట్రాఫిక్ స్టేషన్‌లో వారికి సీఐ ప్రవీణ్ కుమార్ మంగళవారం కౌన్సిలింగ్ ఇచ్చారు. అంతకు ముందు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఆటోలు నడిపిన డ్రైవర్లకు రూ.7,500 జరిమానా విధించారు.కార్యక్రమంలో ఎస్సై గోపాల్‌రెడ్డి,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

వర్ధ వేణుకు డాక్టరేట్

మిరుదొడ్డి, ఫిబ్రవరి 4 : మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన వర్ధ వేణు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నాడు. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో 'తెలుగు-పర్యావరణ, స్పృహ' అనే అంశంపై ఆచార్య సాయి కమలాకర్‌శర్మ పర్యవేక్షణలో పీహెచ్‌డీ గ్రంథాన్ని సమర్పించి 2025, జనవరి 28వ తేదీన డాక్టరేట్ పట్టా పొందాడు. ఈ సందర్భంగా ఆయన తెలుగుశాఖ ప్రొఫెసర్లు కమలాకర్‌శర్మ, ఖాసీం, డాక్టర్లు రఘు, విజయలక్ష్మి , తెలుగు విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ నిత్యానందరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

తప్పులతడకగా బీసీ కులగణన

మిరుదొడ్డి, ఫిబ్రవరి 4 : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన బీసీ కులగణన తప్పుల తడకగా మారిందని బీసీ నాయకుడు, మాజీ సర్పంచ్‌లు తుమ్మల బాల్‌రాజు, మొగుల్లఐలయ్య, వల్లాల సత్యనారాయణ అన్నారు. మంగళవారం బీసీ కులగణనను వ్యతిరేకిస్తూ మిరుదొడ్డి టౌన్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. మూడు నెలల నుంచి బీసీ కులగణన పూర్తి చేయకపోవడం సీఎం రేవంత్ రెడ్డి వైఫల్యానికి నిదర్శమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో బీసీ నాయకులు గొట్టం బైరయ్య, శివకుమార్, విద్యాసాగర్, బైరయ్య, సత్యనారాయణ, పరశురాములు, భిక్షపతి, వెంకటయ్య, సత్తయ్య, రాధాకృష్ణ పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు సిద్ధం కావాలి

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), ఫిబ్రవరి 4 : విద్యార్థులు టెన్త్ పరీక్షలకు సిద్ధం కావాలని అక్బర్‌పేట-భూంపల్లి మండల ఎంఈవో అంజాగౌడ్ కోరారు. మంగళవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని ఖాజీపూర్ జడ్పీ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకున్నాడు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'మల్లన్న' మూడో వారం ఆదాయం రూ.43,28,732

చేర్యాల, ఫిబ్రవరి 4 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి మూడో ఆదివారం సందర్భంగా రూ.43,28,732 ఆదాయం సమకూరిందని ఆలయ వర్గాలు మంగళవారం వెల్లడించాయి. ఆర్జిత సేవలు, గదులు, దర్శనాలు, ప్రసాదాల విక్రయం తదితర వాటి ద్వారా శనివారం రూ.3,33,341, ఆదివారం రూ.32,71,796, సోమవారం రూ.7,23,605 ఆదాయం సమకూరినట్లు ప్రకటించారు.ఉత్సవాల సందర్భంగా స్వామివారి ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందచేత

మర్కూక్,ఫిబ్రవరి 4: మండలంలో పాములపర్తి గ్రామానికి చెందిన పిట్ల యాదగిరి ఇటీవల అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందాడు. సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.37500 మంజూరైంది. మంగళవారం బాధిత కుటుంబానికి మాజీ ఎంపీపీ పాండుగౌడ్ సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సర్టిఫికెట్లు ప్రదానం

గజ్వేల్, ఫిబ్రవరి 4: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వారం రోజులుగా నిర్వహించిన ఎంప్లాయిమెంట్ స్కిల్ ట్రైనింగ్ మంగళవారం ముగిసింది. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ కమలా క్రిస్టియాన, అధ్యాపకులు పాల్గొన్నారు.

సూర్య నమస్కారాలతో ఆరోగ్యం

సిద్దిపేట, ఫిబ్రవరి 4: సూర్య నమస్కారాలతో కిరణాలు శరీరంపై ప్రసరించి మనిషికి మేలు జరుగుతుందని యోగా అసోసియేషన్ ప్రతినిధులు తోట అశోక్, నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య , విక్రమ్‌రెడ్డి, ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని కోమటి చెరువు రూబీ నెక్లెస్ రోడ్డుపై వ్యాస మహర్షి యోగా సొసైటీ, జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, భారత స్వాభిమాన్ ట్రస్టు ఆధ్వర్యంలో సామూహిక సూర్య నమస్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉగాది శిక్షకురాలు తోట సంధ్య, అయితే అంజయ్య, మాంకాల నవీన్, చిప్ప ప్రభాకర్, రాములు, యోగా శిక్షకులు సురేశ్, సాయి, కవిత, నర్మద, స్వామి, ఆనంద్, వేణు, నర్సింహులు, మంజుల, అరుణ, నందిని, విదిషా పాల్గొన్నారు.